'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పీవోకేలో ఎన్నికలు.. సాధ్యాసాధ్యాలు

గుమ్మడిదల రంగారావు

మొన్న కేంద్ర హోం శాఖామాత్యులు అమిత్ షా లోక్‌సభలో ఒక బిల్లును ప్రవేశ పెట్టారు. అదే జమ్మూకశ్మీర్ రీ-ఆర్గనైజేషన్ బిల్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో రాజ్యాంగంలో 370 ప్రకరణం రద్దుచేసి దాని కింద పొందుపరిచిన జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హోదాను తొలగించింది. ఆ సందర్భంగా ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ఆ ప్రాంతాలు లెఫ్టినెంట్ గవర్నర్ పరిపాలనలో ఉన్నాయి. ఆ తర్వాత అక్కడ ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించే దిశగా మొన్న రీ-ఆర్గనైజేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అంటే అక్కడ చట్టసభలను ఏర్పాటు చేయాలని ఆ బిల్లు ఉద్దేశం. అది హర్షణీయమైన చర్యగానే చూడాలి. అయితే ఆ బిల్లులో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కూడా ఎన్నికలు జరపాలన్న అంశాన్ని చేర్చడం చర్చనీయాంశమైంది.

ఇక్కడ క్లుప్తంగా చరిత్ర గురించి చెప్పాలి. మనకు బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ప్రకటించినప్పుడు రాజవంశీకుల అధీనంలో ఉన్న సంస్థానాల విషయం ఏమీ తేల్చకుండా వారి ఇష్టానికి వదిలేసింది. అంటే ఈ సంస్థానాలు స్వతంత్రంగా ఉండవచ్చు లేదా భారత్‌లో కానీ పాకిస్థాన్‌లో కానీ చేరవచ్చు. ఉదాహరణకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న నిజాం పాకిస్థాన్‌లో చేరాలనుకున్నాడు. అది చారిత్రక సత్యం. అలాగే జమ్మూకశ్మీర్ అనేది మహారాజ హరిసింగ్ ఆధీనంలో ఉన్నది స్వాతంత్ర్యం వచ్చేనాటికి. హరిసింగ్ స్వతంత్రంగానే ఉంటాను గానీ ఏ దేశంలోనూ చేరను అని తీర్మానించుకున్నారు. అయితే అక్కడ ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు తిరుగుబాటు చేశాయి హరిసింగ్‌కు వ్యతిరేకంగా. అప్పుడు ఆయన భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించాడు. భారత ప్రభుత్వం సహాయం కావాలంటే ఆయనను భారతదేశంలో చేరమని ప్రతిపాదించింది అప్పటి ప్రభుత్వం. ఆ సూచన మేరకు హరిసింగ్ భారతదేశ సార్వభౌమత్వాన్ని అంగీకరిస్తూ ఒక ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచారం వంటి అంశాల మీద అధికారాలు భారత ప్రభుత్వానికి బదలాయించడం జరిగింది. అయితే ఆ రాష్ట్రానికి ఒక ప్రత్యేక స్థానాన్నిచ్చింది భారత ప్రభుత్వం. అక్కడ ఆ రాష్ట్రానికి చెందని భారతీయులు ఆస్తి కొనుగోలు చేసే అవకాశం లేదు. వారికొక రాజ్యాంగం, ఒక జెండా గట్రా ఉండేలా చేసింది ఆ ఒప్పందం కిందనే. క్రమేపీ జమ్మూకశ్మీర్ భారత భూ భాగంలో విడదీయరాని విధంగా కలిసిపోయింది. అయితే మహారాజు హరిసింగ్ మీద జరిగిన తిరుగుబాటు సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని కొంత భూ భాగం పాకిస్థాన్ ఆక్రమణలోకి వెళ్లింది. అదే ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీర్‌గా గుర్తింపు పొందిన ప్రాంతం. ఇది పాకిస్థాన్ ఆధీనంలో ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. కానీ, మనం మాత్రం అది భారత భూ భాగమే అని అంటున్నాం.

పాక్ ఆక్రమిత కశ్మీర్, భారత ఆధీనంలోని కశ్మీర్ భూ భాగాల మధ్య ఉన్నదాన్ని వాస్తవ ఆధీన రేఖగా పిలుస్తారు. ఆ వాస్తవ ఆధీనరేఖ దాటి మనం అటు వెళ్లం, వాళ్లు ఇటు రారు. ఆ రేఖను దాటి అవతలికి వెళ్లి పాకిస్థాన్ సైన్యానికి బందీగా చిక్కిన అభినందన్ వర్ధమాన్ అనే భారత వాయుసేన పైలెట్ పేరు నేడు ఎంతమందికి గుర్తుందో కానీ, ఆనాడు దేశం అంతా కూడా వర్ధమాన్ సురక్షితంగా స్వదేశం రావాలని ప్రార్థించారు. మన ప్రార్థనలు ఫలించి ఆయన క్షేమంగా తిరిగివచ్చారు. మళ్లీ చెక్కుచెదరని, మొక్కవోని స్థయిర్యంతో ఆయన వాయుసేన విధుల్లో చేరారు. యావత్ దేశం హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నది. ఈ రేఖకు అటూ ఇటు ఇరు సైన్యాలు మోహరించి ఉంటాయి.

కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం.. జమ్మూ కశ్మీర్‌కు అసెంబ్లీ సీట్ల పునర్విభజనతో పాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతానికి కూడా కొన్ని సీట్లు కేటాయించారు. అది భారత భూభాగమే కావున అక్కడ కూడా ఎన్నికలు జరుపుతామని కేంద్రం అంటున్నది. మన ఆధీనంలో లేని ప్రాంతంలో మనం ఎలా ఎన్నికలు జరుపుతామనేదే ఇప్పుడు చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల్లో పార్లమెంటుకు ఎన్నికలు జరుగనున్న తరుణంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పాక్ ఆక్రమిత కశ్మీర్లో ఎన్నికలు జరుపుతామని పార్లమెంటులో ప్రకటించటం ఇరుదేశాల మధ్య కొత్త వివాదాన్ని లేవనెత్తే ప్రయత్నంగా చూస్తున్నారు విశ్లేషకులు. మనకు హక్కున్నప్పటికీ మన ఆధీనంలో లేని దాన్ని తిరిగి పొందాలంటే దౌర్జన్యంగా లాక్కోవాలి. అలా చేస్తే అవతలి వారు ఊరుకోరు కదా? అందువల్లనే తగాదాలు వస్తుంటాయి. రెండు సైన్యాల మధ్య తగాదా అంటే యుద్ధమే అనుకోవాలి కదా! అణ్వాయుధాలు కలిగి యుద్ధం చేసిన చరిత్ర ఉన్న ఇరుదేశాల మధ్య ఘర్షణ అంటే అది రెండువైపులా అలజడి, ఆందోళన కలిగించే అంశం అనటంలో సందేహం లేదు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ మహారాజు హరిసింగ్ రాజ్యంలోని అంతర్భాగమే. అది తిరుగుబాటు ద్వారా పాకిస్థాన్ ఆధీనంలో ఉందిగానీ హరిసింగ్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం ఆ ప్రాంతం మనదే అన్నది మన వాదన. వాదన ఎలా ఉన్నప్పటికీ వాస్తవంగా అది మన ఆధీనంలో లేదు. ప్రతిపాదిత అసెంబ్లీలో ఆ

ప్రాంతానికి కూడా కొన్ని సీట్లు కేటాయించటం వరకు సరే. ఆ ప్రాంతం మనది కాబట్టి అక్కడ కొన్ని సీట్లు కేటాయించటం సమంజసమే. అట్లా చెయ్యకపోతే దానిమీద మనం హక్కును వదులుకున్నట్టుగానే భావించే ప్రమాదం ఉన్నది. కశ్మీర్‌లో ఎన్నికలు జరిగినా, ఆ సీట్లు అలాగే ఖాళీగా ఉంటాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు కేటాయించిన సీట్లు అలాగే ఖాళీగా ఉంటాయి. అత్తారింటికి దారేదిలో సునందకు చెందిన షేర్లూ కుర్చీ అలాగే ఎవరూ కూర్చోకుండా ఖాళీగా ఉంచినట్టు. ఏదో ఒకరోజు తిరిగి రాకపోతుందా అన్న ఆశ ఉంది అక్కడ. మనం కూడా సెంటిమెంటల్‌గా ఆ సీట్లను ఖాళీగా ఉంచటం వరకు ఓకే. మనది కాబట్టి మన ఆధీనంలో లేకపోయినా అక్కడికి పోయి ఎన్నికలు జరుపుతామనుకోవటంలో సెంటిమెంటల్ అంశం కాస్తా మెంటల్ అంశంగా మారి లేనిపోని అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉన్న విషయాన్ని మనం మరువరాదు!

ఎందుకంటే పాకిస్థాన్ ఆధీనంలో ఉన్న భూ భాగంలో మనం ఏ విధంగా ఎన్నికలు జరుపుతాం?ఆ భూమి మనదే అనటం ఒక ఎత్తు. అక్కడికి పోవాలనుకోవటం మరో ఎత్తు. అక్కడికి పోయే అవకాశం లేకపోయినా అక్కడ కూడా ఎన్నికలు జరుపుతామనటం ఉత్తర కుమార ప్రగల్భాలు అనుకోవాలి. ప్రగల్భాలతో సరిపెడితే సరే. అంతవరకూ ఏ ఇబ్బంది లేదు. కానీ పార్లమెంటుకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఎన్నికల సమయానికి ప్రభుత్వానికి సాధించామని చెప్పుకోవటానికి ఏ అంశమూ లేక ఏదో చేశామని చూయించుకోవటానికి ఏదైనా సాహసానికి దిగితే అది ఇరుదేశాల మధ్య తీవ్ర సమస్యగా పరిణమించే ప్రమాదం ఉన్నది. ఇదే విజ్ఞులను, విశ్లేషకులను, పరిశీలకులను భయపెడుతున్నది.

> **అంతర్గత విషయాలను విదేశీ వ్యవహారాలు ప్రభావితం చెయ్యటమనేది ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు కొత్తేమీ కాదు. 1971లో పాకిస్థాన్ యుద్ధం చేసి బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన తర్వాత మన పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఆ సంఘటన ప్రభావం చాలా ఉన్నది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని అపరకాళితో పోల్చింది యావత్ భారతదేశం. నేటి బీజేపీ ప్రభుత్వానికి ఇప్పటిదాకా అంశం ఏదీ లేదు ప్రజలకు చూయించుకోవటానికి.**

బీజేపీకి ఉన్న అంశాలన్నీ అనుత్పాదక అంశాలే. అయోధ్యలో మందిర నిర్మాణం కానీ, నూతన పార్లమెంటు భవన నిర్మాణం కానీ, 370 అధికరణం రద్దు గానీ, చంద్రయాన్-3 విజయం కానీ ప్రజల జీవితాన్ని ప్రభావితం చేసే ఉత్పాదక అంశాలు కావు. భావోద్వేగ అంశాలే కానీ, దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచామని చెప్పుకోవటానికి పనికొచ్చే అంశాలు కాదు. అటువంటి సందర్భాల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశం ఉన్న అంశం ఇది. అందుకే ప్రజాభిప్రాయం స్థిరంగా నిలిచి ప్రభుత్వ ఆలోచనకు బ్రేకు వేసేదిగా ఉండాలి. ఇరు దేశాల మధ్య ఇప్పుడున్న సమస్యలు చాలు. కొత్త సమస్యలు అవసరం లేదు. రెండువైపులా ప్రజలు శాంతినే కోరుకుంటున్నారు. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో నివసించే భారతీయులు, పాకిస్థానీయులు ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారు. ఇద్దరి మధ్య సంబంధ బాంధవ్యాలను నెలకొల్పే ఉమ్మడి అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని పెంపొందిద్దాం. సుహృద్భావ వాతావరణం కోరుకుందాం.

పిల్లల రేపటి కోసం

మన నేటి త్యాగం

'మన పిల్లల రేపటి కోసం, నేటిని త్యాగం చేద్దాం' అనే నినాదంతో ఏటా యూనిసెఫ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. యూనిసెఫ్ అనగా యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఎమర్జెన్సీ ఫండ్. పేరు సూచించినట్టుగా, ఈ సంస్థ ప్రపంచానికి, ప్రత్యేకంగా పిల్లలకు సహాయం చేయడానికి అవసరమైన నిధులను సేకరిస్తుంది. ఈ ఏడాది 'ప్రతి బిడ్డ కోసం-ప్రతి హక్కు' అనే థీమ్‌తో యూనిసెఫ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. ప్రపంచంలోని అణగారిన వర్గాల పిల్లల స్థితిగతులను ఉద్ధరించడానికి యూనిసెఫ్ అసోసియేట్లు నడుం బిగించిన డిసెంబర్ 11ను ఏటా యూనిసెఫ్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

సీవీవీ ప్రసాద్
80196 08475

ఐక్యరాజ్యసమితి .. బాలల సంక్షేమం కోసం స్థాపించిన సంస్థ యూనిసెఫ్. బాలల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు ఈ సంస్థ కృషి చేస్తున్నది. పిల్లలకు టీకా మందులు , పోషకాహార అవసరాన్ని తెలియజేస్తూ, తమ బాల్యం ఆనందంతో గడుపుతూ ఎదిగేలా చేయాలనే లక్ష్యంతో పనిచేసే సంస్థ యూనిసెఫ్.

యుద్ధంలో ఓటమి చవిచూసిన దేశాల్లోని పిల్లలకు మద్దతుగా, వారికి ఊరటను అందించడంలో సహకరించేందుకు గాను రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ .. 'యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్‌ను (యునిసెఫ్)'ను ఏర్పాటుచేసింది. 1940ల నాటి ఆహార , వైద్య సంక్షోభం ముగిసిన తర్వాత సంక్షుభిత దేశాల్లోని పిల్లల సహాయ సంస్థగా యూనిసెఫ్ తన పాత్రను కొనసాగించింది. 1970వ దశకంలో పిల్లల హక్కుల పరిరక్షణ సంస్థగా రూపుదిద్దుకున్నది.

1980లో పిల్లల హక్కుల ముసాయిదా తయారీలో యూనిసెఫ్ ఐక్యరాజ్య సమితి మానవహక్కుల కమిషన్‌కు సహకరించింది. 1989 యూఎన్ జనరల్ అసెంబ్లీకి పరిచయం తర్వాత పిల్లల హక్కుల కన్వెన్షన్ అత్యంత విస్తృతమైన మానవ హక్కుల ఒప్పందంగా చరిత్రలో నిలిచిపోగా, ఈ ప్రయత్నంలో యునిసెఫ్ కీలక పాత్ర పోషించింది. 183 ఐక్యరాజ్య సమితి సభ్యదేశాల్లో కేవలం సోమాలియా, అమెరికా దేశాలు మాత్రమే ఒప్పందం అమల్లో విఫలమయ్యాయి. సోమాలియాకు అంతర్జాతీయ గుర్తింపు గల ప్రభుత్వం లేకపోవడంతో ఒప్పంద అమలు అక్కడ ఎంతమాత్రం సాధ్యపడలేదు. యూనిసెఫ్‌ను 1946 డిసెంబరు 11న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఏర్పాటుచేశారు. జాతి, మత,రాజకీయ వివక్షలేవీ లేకుండా అవసరాలే ఆధారంగా పిల్లలకు సహాయపడాలన్నది యూనిసెఫ్ లక్ష్యము .

మొదట్లో ఇది తాత్కాలికమైన ఎమర్జెన్సీ సంస్థ గానే ఉండేది. 1947 నుంచి 1950 వరకు రెండో ప్రపంచ యుద్ధకాలంలో దెబ్బతిన్న పిల్లలకు సహాయం అందించడమే తన ధ్యేయంగా పనిచేసింది. యూనిసెఫ్ 31.90 కోట్ల టన్నుల పాలు, దుస్తులు, స్కూలు అవసరాలను యూరప్, చైనాల్లోని పిల్లలకు అందించింది. క్షయ వ్యాధికి 'రెడ్‌క్రాస్' సహకారంతో టీకాలు వేయించింది. యూరోపియన్ అత్యవసర పరిస్థితి ముగిసిన తర్వాత కూడా చేయాల్సిన పని చాలా మిగిలిపోయింది. దీంతో ఆఫ్రికా, మధ్యప్రాచ్యం , దక్షిణ అమెరికాల్లోని వర్ధమాన దేశాల్లో యూనిసెఫ్ పని ప్రారంభించింది. 1953లో సుదీర్ఘ చర్చల అనంతరం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ యూనిసెఫ్ శాశ్వత మనుగడకు ఓటువేసింది. దాని పేరునుంచి అంతర్జాతీయ, ఎమర్జెన్సీ అన్న పదాలను పూర్తిగా తొలగించింది. కానీ యూనిసెఫ్ అన్నది అలా నిలిచిపోయింది. యూనిసెఫ్ 150 దేశాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పనిచేస్తున్నది.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కార్యక్రమాల నిర్వహణకుగాను సంపన్న దేశాల్లోని 36 జాతీయ కమిటీల ద్వారా నిధులను సేకరించే కార్యక్రమాన్ని, పిల్లల హక్కులకు సంబంధించి అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ నిరంతరం కృషిచేస్తున్నది.

ఆహార సంక్షోభం అంచున భారత్

దేశంలో ఆహార సంక్షోభం తలెత్తే సూచనలు కనిపిస్తున్నాయి. 140 కోట్ల మంది భారతీయులు ఆకలితో అలమటించే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జాతీయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని చూస్తే ఈ భయాలు కలగకమానదు. గోధుమలు, బాస్మతీ, చక్కెర, పారా బాయిల్డ్ బియ్యం ఎగుమతులపై మోదీ సర్కార్ ఆంక్షలు విధించడం ఈ భయానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థికవ్యవస్థ 7.6 శాతం వృద్ధి రేటును కనబరిచింది. అయితే జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 1.2 శాతం మాత్రమే నమోదవడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో వ్యవసాయ రంగం వాటా 3.5 శాతంగా ఉండటం గమనార్హం. దీన్ని బట్టే చెప్పవచ్చు దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని. భారతీయులు ఆహార సంక్షోభం అంచున ఉన్నారనడానికి ఇదే నిదర్శనంగా నిలుస్తున్నది.

వాతావరణ మార్పుల కారణంగా దేశవ్యాప్తంగా ఈ ఏడాది పంటల సాగు లక్ష్యానికి అనుగుణంగా సాగలేదు. ఎల్‌నినో ప్రభావంతో మొదటి నుంచి వర్షాలు ముఖం చాటేయడం దెబ్బతీసింది. గడిచిన ఖరీఫ్ సీజన్‌లో చాలా తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. నైరుతీ రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో జూన్, జూలైలో వానలు కురవకపోగా.. ఆగస్టులో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం బిజర్పాయ్ తుపాను పశ్చిమ భారత్‌లో సాగైన పంటలను తుడిచిపెట్టుకుపోయింది. భారత్‌లో 4 శాతం వరి సాగు తగ్గిందని అమెరికా వ్యవసాయ విభాగం అంచనా వేయగా.. దీన్ని భారత వ్యవసాయ శాఖ కూడా ధ్రువీకరించింది. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో వరి ఉత్పత్తిలో 3.7 శాతం క్షీణత కనిపించడం శోచనీయం.

> **దేశంలో పంట దిగుబడులు తగ్గుముఖం పట్టడంతో ఆహార నిల్వలు ఆరేండ్ల కనిష్ఠానికి చేరుకున్నాయి. ఈ విషయం మరింత ఆందోళన కలిగిస్తున్నది. దేశంలో నెలకొన్న ఆహార సంక్షోభ పరిస్థితులను అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వం గోధుమలు, చక్కెర, బాస్మతీ బియ్యం తదితర ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. పారా బాయిల్డ్ బియ్యంపై కూడా ఆంక్షలు విధించిందంటేనే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.**

మన దేశంలో సుమారు 40 శాతం మంది వ్యవసాయ సంబంధిత రంగాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామీణ భారతం ఉపాధికి దూరమైంది. రానున్న రోజుల్లో అయినా పరిస్థితులు చక్కబడతాయా అంటే కచ్చితంగా చెప్పలేం. రుతుపవనాలు, జాతీయ నీటి నిల్వల డాటాలతో జీడీపీలో వ్యవసాయ రంగం వాటాను పోల్చి చూస్తే ఈ విషయం అవగతం అవుతున్నది. అయితే ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం గోప్యంగా ఉంచడం పరిస్థితిని మరింత ప్రమాదంలోకి నెట్టివేస్తున్నది.

ఇప్పటికే దేశంలో ఆహార ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటాయి. ఇటీవల విడుదలైన క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్, అనలిటిక్స్ రీసెర్చ్ విస్తుపోయే వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చింది. పేద, మధ్య తరగతి కుటుంబాలు భోజనం చేయాలంటే జంకే పరిస్థితులు ఉన్నట్టు ఆ సంస్థ వెల్లడించడం గమనార్హం. నవంబర్ నెలలో శాఖాహార భోజనం ధరలు 10 శాతం మేరకు పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. అదే సమయంలో మాంసాహార భోజనం ధరలు 5 శాతం పెరిగాయి. ఈ లెక్కన ఒక నెలలో శాఖాహార భోజనంపై రూ.840 అదనపు భారం పడుతున్నది. అదే సమయంలో మాంసాహార భోజనంపై రూ.900 అదనంగా వెచ్చించాల్సి రావడం మోయలేని భారంగా మారుతున్నది.

ఆకాశాన్నంటుతున్న ధరల కారణంగా మన దేశంలో ఆకలితో అలమటించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ఆకలి అనేదే లేకుండా చేస్తున్నామని, పేదలు లేని భారత్‌ను చూడబోతున్నామని మోదీ సర్కార్ ఊదరగొడుతున్నా.. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. తాజాగా బయటికొచ్చిన బీహార్ కుల గణనను పరికిస్తే విస్తుపోయే విషయాలు తెలుస్తాయి. బీహార్‌లోని 34.1 శాతం కుటుంబాల ఒక నెల ఆదాయం రూ.6000 కంటే తక్కువ కావడం గమనార్హం. ఈ ఆరు వేల రూపాయలతోనే ఒక కుటుంబం నెల మొత్తం బతుకీడ్చాల్సి రావడం అక్కడి దుర్భర పరిస్థితులను కండ్లకు కడుతున్నాయి. అయితే ఈ వాస్తవాలను విస్మరిస్తూ పేదరికం తగ్గుముఖం పట్టిందని కల్లబొల్లి కబుర్లు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం బీహార్ కూడా మన దేశంలో అంతర్భాగమేనన్న విషయాన్ని తెలుసుకుంటే మంచిది.

- ఎడిటోరియల్ డెస్క్

పర్వతారోహణను ప్రోత్సహిద్దాం

కె రంగారావు
98492 70575

అంతర్జాతీయ పర్వత దినోత్సవం ఏటా డిసెంబర్ 11న నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి పలు కార్యకలాపాల ద్వారా కొనసాగిస్తున్నది. మన దేశంలో భారతీయ పర్వతారోహణ సంస్థ ఆదేశంతో దేశంలోని పలు పర్వతారోహణ సంస్థలు వివిధ కార్యక్రమాలను నిర్వహించతలపెట్టాయి. ఈ సంవత్సరం 'పర్వత పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించటం' కార్యక్రమంలో భాగంగా వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆయా సంస్థలు నిర్ణయించాయి. అందులో భాగంగా సదస్సులు, సెమినార్లను విద్యార్థులకు పెయింటింగ్ పోటీలను నిర్వహించనున్నాయి. అలాగే పర్వతాల సంరక్షణ కోసం కృషిచేస్తున్న వారికి పురస్కారాలు అందజేయాలని కూడా నిర్ణయించారు.

> **పర్వతాల మీద ఆధారపడి ప్రపంచ జనాభాలో 15 శాతం మంది ప్రజలు జీవిస్తున్నారు. మంచుతో కూడిన పర్వతాలు అత్యంత ఆకర్షణీయ సాహస పర్యాటక ప్రాంతాలుగా విస్తరిస్తూ పర్వత పర్యాటకంపై ఆధారపడిన వారికి ఆదాయ మార్గంగా పనిచేస్తున్నాయి. నేపాల్, యూరప్‌లోని కొన్ని దేశాలు పూర్తిగా పర్వతాలపై ఆధారపడి జీవిస్తున్నాయి.**

భారతదేశంలో హిమాలయ శ్రేణులు సుమారు 2,400 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి. ఇందులో అనేక పర్వతాలు సుమారు 1100 అడుగుల నుంచి 24 వేల అడుగుల ఎత్తువరకున్న పర్వతాలు కూడా ఉన్నాయి. జీవనదులైన గంగా, బ్రహ్మపుత్ర, యంగెజ్ వంటివి ఈ పర్వతాల నుంచే ప్రవహిస్తున్నాయి. మన హిమాలయ పర్వతాలు ప్రపంచంలోనే 3వ అత్యధిక మంచుతో కూడిన పర్వతాలు. తర్వాత కారకోరం పర్వత పంక్తులు. ఈ పర్వత శ్రేణులు భారత్, చైనా సరిహద్దుల్లో విస్తరించి ఉన్నాయి, ఇవి సుమారు 500 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి. ప్రపంచంలోని 2వ అతిపెద్ద పర్వతం కే2 (8,611) మనదేశంలో అతిపెద్ద పర్వతం కాంచనజంగా 8,586 మీటర్లు. తర్వాత నందదేవి 7,816 మీటర్లు.

ఇవి కాకుండా ఆరావళి పర్వతాలు సుమారు 700 కి.మీ.లు విస్తరించి ఉన్నాయి, ఢిల్లీ నుంచి రాజస్థాన్, హర్యానా నుంచి గుజరాత్ వరకు ఈ పర్వతాలు విస్తరించి ఉన్నాయి. ఇవి మంచుతో కూడినవి కావు, ఇక్కడ గురుశిఖర్ ఎత్తయిన పర్వతం (5,650 అడుగులు) ఆ తర్వాత వెస్ట్రన్ ఘాట్స్ వీటిని యునెస్కో ప్రపంచ వారసత్వంగా గుర్తించింది. ఈస్టన్ ఘాట్స్ బెంగాల్ నుంచి ఏపీ, కర్ణాటక, తమిళనాడు వరకు విస్తరించి ఉన్నాయి. ఎత్తయిన పర్వతం జిందగాద్ (5,540 అడుగులు).

ముఖ్యంగా మన దేశంలోని విద్యార్థులు, యువతకు హిమాలయ పర్వతాలను గురించి అవగాహన కల్పించాలి. ఎందుకంటే మన దేశ సరిహద్దులో రక్షణపరంగా ఇవి ఎంతో కీలకమైనవి. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా మంచుతో కూడుకున్న చిన్నపెద్ద సుమారు 16 వేల పర్వతాలు మన దేశంలో ఉన్నాయి. వీటి ప్రాముఖ్యం గురించి భవిష్యత్తు తరాల వారికి అవగాహన కల్పించాలి.

పర్వతాల గురించి పర్వతారోహకులకు వాస్తవ పరిస్థితులను తెలియజేయవలసిన బాధ్యత పర్వతారోహణ సంస్థలకు ఉన్నది. అనేక మంది పర్వతారోహకులకు పర్వతాల గురించి కానీ, పర్వతారోహణ గురించి అవగాహన లేదు. మన భారతదేశంలో మంచుతో కూడిన పర్వతాలను మన యువత అధిరోహించడానికి ముందుకురావాలి. దేశంలోని అనేక పర్వతాలు పర్వతారోహణకు చాలా అనుకూలంగా ఉన్నాయి. దేశంలోని పర్వతారోహకులను ప్రోత్సహించడం ద్వారా మన దేశానికి కూడా అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది.

(నేడు అంతర్జాతీయ పర్వత దినోత్సవం)